## క్లుప్తంగా

### విధుల్లోకి అంగన్‌వాడీ సిబ్బంది



ఉదిరిపికొండలో పిల్లలకు పాఠాలు చెబుతున్న టీచర్

కూడేరు: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె విరమించి మంగళవారం విధుల్లోకి చేరారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మండలంలో మొత్తం 48 అంగన్‌వాడీ సెంటర్లు తెరుచుకున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు 47 మంది, 40 మంది ఆయాలు, ఐదుగురు మినీ అంగన్‌వాడీ టీచర్లు వారి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ తెలిపారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారారం అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

### థ్యాంక్యూ సీఎం సర్..



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

శెట్టూరు: అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో మంగళవారం మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది థ్యాంక్యూ సీఎం జగన్ సర్ అంటూ స్వీట్లు పంచిపెట్టారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒకరినొకరు మిఠాయిలు పంచిపెట్టారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై తీసుకున్న నిర్ణయాలపై చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది అపర్ణ, నాగమణి, గౌరమ్మల, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళ అదృశ్యం



రమాదేవి

కూడేరు: మండలంలోని మరుట్ల–3 కాలనీకి చెందిన రమాదేవి అనే మహిళ ఈ నెల 19 నుంచి కనిపించలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కూతురు సంధ్య మంగళవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడిగా కాంతారెడ్డి



రాయదుర్గంటౌన్: రాయదుర్గం రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడుగా ఆర్బీ కాంతారెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడితోపాటు కమిటీని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంతారెడ్డి ఉపాధ్యక్షుడిగా మోపురి వెంకటేష్‌రాజు, కార్యదర్శిగా నారాయణస్వామి, సంయుక్త కార్యదర్శిగా ఆర్‌కే నాగరాజు ఎన్నికయ్యారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### నేడు ఎంపీ పర్యటన

కళ్యాణదుర్గం: నియోజకవర్గ కేంద్రంలో బుధవారం జరిగే పలు అభివృద్ధి పనులకు ఎంపీ, కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరుకానున్నారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీ ప్రారంభించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



సిద్ధరాచర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నార్పల: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చందన, శశికళ పేర్కొన్నారు.మంగళవారం సిద్ధరాచర్ల గ్రామంలో వారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామీణ పటం, కాలక్రమం, బార్ గ్రాఫ్, ప్రాబ్లమ్ ట్రీ అనాలసిస్, సీజనల్ క్యాలెండర్, మ్యాట్రిక్స్ ర్యాకింగ్ తదితర వాటిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులతో వ్యవసాయంలో లాభాలు రావాలంటే అధునిక పద్ధతులు పాటించాలన్నారు. ప్రతి రైతు పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. బద్వేలు ఎస్బీవీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



సభకు వస్తున్న జనం



సీఎంకు జేజేలు కొడుతూ..

# వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

- సీఎం జగన్ రాకతో పులకించిన ఉరవకొండ
- అభిమాన నాయకుడిని చూసేందుకు బారులు తీరిన ప్రజలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాకతో ఉరవకొండ పులకించింది. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. అభిమాన నాయకుడు జగన్‌ను చూసేందుకు ప్రజలు, యువత, రైతులు, మహిళలు పోటీపడ్డారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత నగదును డ్వాక్రా సభ్యుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని మంగళవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉరవకొండలో ప్రారంభించారు. ఎస్‌కే జూనియర్ కళాశాల నుంచి సభా వేదిక వరకూ ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలు ఆకట్టుకున్నాయి. సీఎం సభకు నియోజకవర్గంలోని ఉరవకొండ, కూడేరు, బెళుగుప్ప, వజ్రకరూరు, విడపనకల్లుతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. సభా వేదిక వద్ద పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. సభా వేదికపై మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఉరవకొండ సర్పంచ్ లలితమ్మ, ఎంపీపీలు నరసింహులు, దేవీబాయి, కరణం పుష్పావతి, నారాయణరెడ్డి, పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యులు ఏసీ పార్వతమ్మ, హనుమంతు, అశ్విని, వశికేరి తేజశ్వణి, మమత, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల చైర్మన్లు గోవిందు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రణయ్‌రెడ్డి, ఆర్డీఓ రాణిసుష్మిత



సీఎం కటౌట్ వద్ద అభిమానుల సందడి



సీఎం ఫ్లెక్సీతో అభిమానుల కేరింతలు



నృత్యం చేస్తున్న మహిళలు



నవరత్నాల పథకాల స్లోగన్‌లతో చిన్నారులు



హెలీకాప్టర్‌లో వస్తున్న సీఎంను చూస్తూ..



జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ..



డప్పులకు యువకుల నృత్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు రోడ్డు పక్కన బారులు తీరిన అభిమానులు

## ‘సురక్ష’తో పేదలకు నాణ్యమైన వైద్యం

బ్రహ్మసముద్రం: రాష్ట్రంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. మంగళవారం మండలంలోని తీటకల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కుర్లగుండా, యనకల్లు, రాయలదొడ్డి, తీటకల్లు గ్రామల ప్రజలకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, సర్పంచులు కవితమ్మ, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరప్ప, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓఆర్డీ వెంకటనాయుడు

కణేకల్లు: కణేకల్లు–2 గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో డాక్టర్లు విజయకుమార్, పావని, చంద్రశేఖర్‌నాయక్ 366 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు.

### అయోధ్యకు నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

రాయదుర్గంటౌన్: అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన సందర్భంగా యాత్రికులు ఆలయాన్ని దర్శించే నిమిత్తం నైరుతీ రైల్వే నాలుగు ప్రత్యేక రైలు సర్వీసులు నడుపుతున్నట్లు అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన షెడ్యూల్ వివరాలను మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య టర్మినల్ బెంగళూరు, మైసూరు, తుంకూరు, చిత్రదుర్గం నుంచి రాయదుర్గం మీదుగా అయోధ్యకు ప్రయాణిస్తాయన్నారు. రాయదుర్గం ప్రాంతవాసులు ఈ రైలు సర్వీసుల ద్వారా అయోధ్యకు వెళ్లి రావచ్చన్నారు. ఈ రైళ్లు జనవరి 31 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

## భల్లూకం సంచారంతో బెంబేలు



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు



రోడ్డుపై గుమిగూడిన ప్రజలు

రాయదుర్గం: పట్టణ నడిబొడ్డులోని దాసప్పరోడ్డులో కేబీ థియేటర్ సమీపాన మంగళవారం ఓ భల్లూకం కనిపించడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రహదారి పక్కనే ఎలుగబంటి ప్రత్యక్షమైంది. పట్టణ శివార్లోని కోట, శాంతినగర్, సిద్దులకొండ తదితర ప్రాంతాల్లో ఇటీవల భల్లూకాల సచారం ఎక్కువైంది. అటువైపు నుంచి పట్టణంలోకి చొరబడి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడి చేరుకుని గస్తీ నిర్వహించారు. ఎలుగుబంటిని బంధించి అటవీ ప్రాంతంలో వదులుతామని ఫారెస్ట్ అధికారి అంజనేయులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఏపీఐఐసీ చైర్మన్, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, నాయకుడు పోరాళ్ల శివా తదితరులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా సుంకులమ్మ ఉత్సవం

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతురు గ్రామంలో మంగళవారం భక్తుల కొంగుబంగారం సుంకులమ్మదేవి ఊరిదేవర మహోత్సవం వైభవంగా ప్రార ంభించారు. ఆదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 2:45 నుంచి 3:25లోపు మేటికుంభం కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి కుంభాలు మంగళవాయిద్యాలు, మేళతాళాలతో ఆలయం చేరే కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానికులతోపాటు గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి తదితరులు



సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

## సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

ఉరవకొండ: దేశవ్యాప్తంగా గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించే సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ మంగళవారం ఉరవకొండ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించినట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నేతలతో కలసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని గుత్తి సేవాఘడ్‌లో వెలసిన సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి ఏడా ఫిబ్రవరిన 15న నిర్వహిస్తామన్నారు. వేడుకలకు దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనులు హజరవుతారన్నారు. ప్రభుత్వం సేవాలాల్ జయంతిని పండుగ రోజుగా ప్రకటించి అధికారిక సెలవుగా ప్రకటించాలన్నారు. ఇందుకు సీఎం సానుకులంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు మల్లికార్జున నాయక్, శ్రీనివాసులు, భాస్కర్, గోవిందు, లక్ష్మానాయక్, శోభా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

## విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం
- అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రాయదుర్గం: విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అడిగిన వెంటనే ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తూ అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేశారు. తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో గత నాలుగున్నరేళ్లుగా వ్యవసాయం పండుగలా మారింది. టీడీపీ హయాంలో కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక మోటర్ల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సివచ్చేది. లోఓల్టేజీతో ఇబ్బందులు తప్పేవికావు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసినా సీనియారిటీ పేరుతో ఏళ్ల తరబడి తిరగాల్సివచ్చేది. సిఫార్సులున్న వారికే అవకాశం దక్కేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ విధానాలు మారిపోయాయి. అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్, ఉచిత విద్యుత్ కనెక్షన్ మంజూరుకు సీఎం జగన్ పెద్దపీటవేశారు.

### కొత్తగా 23,116 విద్యుత్ కనెక్షన్లు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ డివిజన్ పరిధిలోని 76,410 వ్యవసాయ, 1,81,364 గృహాలు, పరిశ్రమలకు చెందిన కనెక్షన్లు ఉన్నాయి. టీడీపీ హయాంలో కేవలం రూ.61 కోట్లు మాత్రమే ఖర్చుచేసి 6,060 విద్యుత్ కనెక్షన్లు, 2,220 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ కారణంగా లోఓల్టేజీతో పంట తడవక వ్యవసాయం కుదేలైంది. రైతాంగం ఇబ్బందుల్లో పడింది. గడిచిన నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఆ కష్టాలు తీర్చేలా సీఎం జగన్ అండగా నిలిచారు. రెట్టింపు స్థాయిలో 23,116 కొత్త కనెక్షన్లు మంజూరు చేశారు. 7,705 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫర కు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం రూ.210 కోట్లు ఖర్చుచేశారు.

### తీరిన లోఓల్టేజీ సమస్య

ప్రతి మూడు పంపుసెట్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో లోఓల్టేజీ సమస్యకు శ్యాశ్వత పరిష్కారం లభించింది. ఒక్కో రైతు రూ.9 వేలు ప్రకారం ముగ్గురు రైతులు రూ.27 వేలు డీడీ చెల్లిస్తే, ప్రభుత్వం సుమారు రూ.3 లక్షలు విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్, 11కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుచేస్తోంది. ఈ లెక్కన ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పై ప్రభుత్వం కు రూ.2.73 లక్షలు అదనంగా భారం పడనుంది. రైతు సంక్షేమం దృష్ట్యా కొన్ని చోట్ల సింగిల్ కనెక్షన్లకు సైతం విద్యుత్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం జగన్ సమర్థవంతంగా అమలుచేస్తున్నారు.



బోరులో సమృద్ధిగా వస్తున్న నీరు



కలుగోడు వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

### అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



రైతులు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. గడిచిన నాలుగేళ్లలో కేవలం 11కేవీ ఎల్‌టీ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.210 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. ఉచిత విద్యుత్ కనెక్షన్లు సైతం గతంతో పోల్చితే రెట్టింపు స్థాయిలో పెంచాం. ఈ కారణంగా లోఓల్టేజీకి తావులేకుండా రైతుకు నాణ్యమైన తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతుంది. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– శేషాద్రిశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం